క్లుప్తంగా

బదిలీ అధికారికి సన్మానం



నాగేశ్వరరావును సన్మానిస్తున్న జీఎం రామచందర్, ఉద్యోగులు తదితరులు

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో పనిచేసి, పదోన్నతిపై కొత్తగూడెం కార్పొరేట్‌కు వెళ్తున్న కొండాపురం భూగర్భగని ఏజెంట్ నాగేశ్వరరావును ఏరియా జీఎం దుర్గం రామచందర్, అధికారులు, ఉద్యోగులు బుధవారం సత్కరించారు. కార్యక్రమంలో ఏరియా ఎస్‌ఓటు జీఎం కృష్ణయ్య, ఏజీఎం (సివిల్) వెంకటేశ్వర్లు, రక్షణ అధికారి వెంకటరమణ, ఏరియా ఇంజనీర్ నర్సిరెడ్డి, మణుగూరు ఓసీ ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాసాచారి, లక్ష్మీపతిగౌడ్, డీజీఎంలు రమేశ్, వెంకట్రావు, వెంగళరావు, అనురాధ, శ్రీనివాసమూర్తి, షబ్బీరుద్దీన్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆదాయం లెక్కింపు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం బ్రిడ్జి సెంటర్‌లోని శ్రీ అభయాంజనేయ స్వామి దేవస్థానం హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కిస్తామని ఆలయ ఈఓ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఇన్‌గేట్ పక్కన ఉన్న శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో ఈ నెల 7న చీరల బహిరంగ వేలం ఉంటుందని వివరించారు.

పాఠశాలలో తనిఖీ

దుమ్ముగూడెం: మండలంలోని చింతగుప్ప గ్రామ పంచాయతీ పరిధి తోగ్గూడెంలోని గిరిజన ప్రాథమిక పాఠశాలను భద్రాచలం ఐటీడీఏ ఎస్‌సీఆర్ పి.వెంకటరత్నం బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బోధనా తీరును పరిశీలించిన ఆయన విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. హెచ్‌ఎం రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రైవేట్ విద్యాసంస్థల్లో దోపిడీ

చర్ల: ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో ఫీజులు అందరికీ తెలిసేలా నోటీస్ బోర్డుల్లో పెట్టాలని, అర్హత గల ఉపాధ్యాయులను మాత్రమే ప్రైవేట్ పాఠశాలల్లో నియమించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షురాలు సంధ్య డిమాండ్ చేశారు. బుధవారం చర్లలో జరిగిన సంఘం కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. జిల్లాలోని ప్రైవేట్ విద్యాలయాల్లో దోపిడీ కొనసాగుతోందని ఆరోపించారు. సమావేశంలో మునిగెల శివ, ప్రవీణ్, రవి, తేజ, రాము, మహేశ్వరి పాల్గొన్నారు.

వరదను నివారించాలి..

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణానికి గోదావరి వల్ల వచ్చే వరద నీరు పట్టణంలోకి రాకుండా నివారణ చర్యలు చేపట్టాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు అల్లాడి పాల్‌రాజ్ కోరారు. పట్టణంలోని ఏఎంసీ కాలనీలో బుధవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మంజువాణి, సుబ్బలక్ష్మి, సుహాసిని, శాంతిరాజు, కనకం, దాసరి శాంతయ్య పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కోత

కరకగూడెం: స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలోని 33 కేవీ లైన్ మరమ్మతుల్లో భాగంగా చెట్ల కొమ్మలను తొలగించనున్నామని, దీంతో గురువారం ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని కరకగూడెం విద్యుత్ శాఖ ఏఈ నరేందర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సర్వే పక్కాగా ఉండాలి

భద్రాచలంటౌన్: పట్టణంలో నిర్వహించే ఇంటింటి సర్వే పక్కాగా ఉండాలని మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్ రామకృష్ణ అన్నారు. బుధవారం బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లతో ఇంటింటి ఓటర్ సర్వే కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. పట్టణంలో ఇప్పటి వరకు 39 పోలింగ్ కేంద్రాల్లో జరిగిన సర్వే వివరాలు ఆయన నమోదు చేశారు. కొత్త ఓటర్లను నమోదు చేయడంతోపాటు మరణించిన వారి ఓట్లు తొలగించాలని సూచించారు. రెండు ఓట్లు కలిగి ఉన్నవారిని గుర్తించాలని చెప్పారు. ఆర్‌ఐ బిక్కులాల్, పుల్లయ్య, నవీన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమం

కరకగూడెం: అన్ని వర్గాల సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఆ పార్టీ పినపాక నియోజకవర్గ మహిళ నాయకురాలు, సమత్ భట్టుపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ పోలేబోయిన శ్రీవాణి అన్నారు. కాంగ్రెస్ ప్రజా చైతన్య యాత్రలో 11వ రోజు బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. పోలేబోయిన తిరుపతయ్య పాల్గొన్నారు.

సదస్సుకు తరలిరండి..

మణుగూరురూరల్: ఈ నెల 9వ తేదీన భద్రాచలంలోని ఐటీడీఏలో జరిగే గిరిజన సంక్షేమశాఖ ఉపాధ్యాయుల ఉమ్మడి జిల్లా సదస్సుకు ఉపాధ్యాయులు తరలిరావాలి టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.రాజు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఏజీహెచ్‌ఎస్ పాఠశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐటీడీఏ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని, పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

సేవలు సరే.. వసతులేవీ?

- బూర్గంపాడు ఆస్పత్రిలో ప్రజలకు తప్పని తిప్పలు
- పురాతన భవనంలోనే చికిత్స
- నిధులు మంజూరైనా మొదలుకాని అభివృద్ధి పనులు



బూర్గంపాడులోని ప్రభుత్వ వైద్యశాల

బూర్గంపాడు: బూర్గంపాడు ప్రభుత్వ సివిల్ ఆస్పత్రిలో వైద్యసేవలు మెరుగుపడినా వసతులు కరువవడంతో చికిత్స కోసం వస్తున్న వారే కాక వైద్యులు, సిబ్బంది ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. గతేడాది ఈ ఆస్పత్రిని 30 పడకలుగా అప్‌గ్రేడ్ చేసి వైద్యవిధాన పరిషత్‌లోకి తీసుకొచ్చారు. దీంతో వైద్యులు, సిబ్బందిని నియమించినప్పటికీ సరిపడా గదులు లేకపోవటంతో ఇబ్బంది పడుతున్నారు. అదేవిధంగా నిజాం నవాబులు నిర్మించిన 60 ఏళ్ల నాటి పురాతన భవనంలోనే చికిత్స అందిస్తుండడం గమనార్హం. ఇన్‌పేషంట్ల కోసం వినియోగిస్తున్న భవనం కూడా పాతబడిపోయింది. ఆస్పత్రి అభివృద్ధి కోసం ప్రభుత్వ విప్ రేగా కాంతారావు ఇటీవల రూ.2.70 కోట్ల నిధులు మంజూరు చేయించినా ఇప్పటి వరకు పనులు మాత్రం ప్రారంభం కాలేదు.

రెండు గదులు.. ఆరుగురు వైద్యులు

ఆస్పత్రిలో ఆరునెలల కిందట తొమ్మిది మంది వైద్యులను నియమించగా వారిలో ఆరుగురు విధులు నిర్వర్తిస్తున్నారు. అలాగే, 15 మంది వరకు సిబ్బంది ఉన్నారు. అయితే, వీరు కూర్చునేందుకు సరిపడా గదులు లేవు. దీంతో ఆరుగురు వైద్యులు కేవలం రెండు గదుల్లోనే పరీక్షించి వైద్యసేవలు అందించాల్సి వస్తోంది. అలాగే, ఆపరేషన్ థియేటర్ ఉన్నా అవసరమైన సామగ్రి లేదు. ఇంకా వైద్యులు, సిబ్బందితో పాటు రోగులకు సరైన టాయిలెట్లు లేవు. పేరుకే 30 పడకల ఆస్పత్రిగా చెబుతున్నా 15 పడకలే అందుబాటులో ఉన్నాయి. వాటికి తోడు ప్యూరిఫైడ్ డ్రింకింగ్ వాటర్ ప్లాంట్ నిరుపయోగంగా మారగా, ఆక్సిజన్ ప్లాంట్‌కు సరిపడా విద్యుత్ సరఫరా కాక పనిచేయడం లేదు. ఇంకా మార్చురీ గది శిథిలావస్థకు చేరడంతోపాటు 108 సిబ్బందికి గది లేక చెట్ల కిందే వేచి ఉండాల్సి వస్తోంది.



నిరుపయోగంగా ఉన్న ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్

నానాటికీ పెరుగుతున్న రద్దీ

ఆస్పత్రిలో చికిత్స కోసం వచ్చే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. గతేడాది మొత్తం 19,515 మందికి వైద్యసేవలు అందించగా.. ఈ ఏడాది ఇప్పటివరకు 20,021 మంది చికిత్స కోసం వచ్చారు. గత ఏడాది మొత్తం 2,459 మంది ఇన్‌పేషంట్లు ఉండగా, ఈ ఏడాది 1,991 మంది నమోదయ్యారు. ఆస్పత్రిలో సరిపడా వైద్యులు, సిబ్బంది ఉన్న నేపథ్యాన మరిన్ని వసతులు కల్పించి భవనాలను ఆధునికీకరిస్తే స్థానికులకు మెరుగైన వైద్యం అందే అవకాశముంటుంది. వానాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున వసతులు మెరుగుపరచాలని స్థానికులు కోరుతున్నారు.

పనులు ప్రారంభం కావాల్సి ఉంది..



వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండడంతో చికిత్స కోసం వచ్చే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. ఆస్పత్రిలో సరిపడా భవనాలు, గదులు లేకపోవటంతో ఇబ్బందిగా ఉంది. ఆక్సిజన్ ప్లాంట్, వాటర్ ప్లాంట్లు నిరుపయోగంగా ఉన్నాయి. వసతుల కోసం విప్ నిధులు మంజూరు చేయించారు. పనులు ప్రారంభం కావాల్సి ఉంది.

–డాక్టర్ నవీన్, ఆస్పత్రి సూపరింటెండెంట్

పెరుగుతున్న ధరలతో ప్రజల ఇబ్బందులు



ములకలపల్లి: మాట్లాడుతున్న కనకయ్య



బూర్గంపాడు: వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

ములకలపల్లి: రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో ప్రజలు ఇక్కట్ల పాలవుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య తెలిపారు. మండలంలోని మాధారంలో నిర్వహిస్తున్న రాజకీయ శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం బడా పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తూ దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో ఆహార భద్రత కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు అన్నవరపు సత్యనారాయణ, రేపాకుల శ్రీనివాస్, మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, గౌరి నాగేశ్వరరావు, నిమ్మల మధు, డిష్ రాంబాబు, సోయం వీరస్వామి, మంచాల సారయ్య, దేవేందర్, గోపగాని లక్ష్మీనర్సు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరలు నియంత్రించాలి

బూర్గంపాడు: సామాన్యుడికి భారంగా మారిన నిత్యావసరాల ధరలను నియంత్రించాలని మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మహిళా కాంగ్రెస్ బీ–బ్లాక్ అధ్యక్షురాలు బర్ల నాగమణి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు పేద, మధ్య తరగతి ప్రజలను ఊచకోత కోస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో భూక్యా సుగుణ, మందా నాగరాజు, కువ్వారపు వెంకటేశ్, రాగా కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

వరి సాగుకు సన్నద్ధమవుతున్న రైతులు

అశ్వారావుపేటరూరల్: మొన్నటి దాకా వరుణుడి జాడ కానరాకపోవడంతో పంటలు సాగు చేసే రైతులు అయోమయంలో పడ్డారు. వానాకాలం సీజన్‌కు అవసర మైన వరి నారు పోయాలా? వద్దా? అనే సందేహంతో ఇబ్బంది పడ్డారు. కొన్ని ప్రాంతాల్లో రైతులు వరి నారు పోసి వరుణుడిపై భారం వేశారు. ఎట్టకేలకు అశ్వారావుపేట మండలవ్యాప్తంగా రెండు రోజులుగా వర్షాలు పడుతుండటంతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. మండల వ్యాప్తంగా ఏటా వానాకాలం సీజన్‌లో ఏడు వేల ఎకరాల్లో వరి పంట సాగు చేస్తుండగా, జూన్ నుంచి వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. నిన్నటి వరకు చెరువులు, ప్రాజెక్టు, బోర్ల కింద మాత్రమే రైతులు వరి సాగు పనులు మొదలు పెట్టగా, మిగిలిన ప్రాంతాల్లో సాగు పనులు నిలిచిపోయాయి. తాజాగా వర్షాలు పడుతుండటంతో వరి సాగు పనులు ఊపందుకున్నాయి. అశ్వారావుపేట, ఊట్లపల్లి, వినాయకపురం, నారాయణపురం, పెదవాగు ప్రాజెక్ట్, గుమ్మడవల్లి, కొత్తూరుతోపాటు పలు గ్రామాల్లో వరి నారు పోసే పనులు చేపట్టారు. అలాగే, పొలాల్లో ట్రాక్టర్లతో దుక్కులు దున్ని సాగుకు సిద్ధం చేస్తున్నారు.

రోజూ యాభై గృహాలు సందర్శించాలి



మాట్లాడుతున్న సబ్ యూనిట్ అధికారి

అశ్వారావుపేటరూరల్: వర్షాకాలం సీజన్ మొదలైన నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో పని చేసే ఆశ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని, రోజుకు యాభై గృహాలు సందర్శించాలని పీహెచ్‌సీ వైద్యులు రాందాస్‌నాయక్, మధుశిక, సబ్ యూనిట్ అధికారి అజ్మీర వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని వినాయకపురం, గుమ్మడవల్లి పీహెచ్‌సీల్లో బుధవారం ఆశ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆశ కార్యకర్తలు గృహాలను సందర్శించి ఆయా ఇళ్ల పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. అలాగే, దోమ లార్వాను తొలగించి, నిల్వ నీటి గుంటల్లో థిమోఫాస్ మందును చల్లాలని సూచించారు. పెద్ద పెద్ద గుంతలు ఉంటే గ్రామ పంచాయతీ ద్వారా వాటిల్లో ఆయిల్ బాల్స్ వేయించాలని, జ్వర కేసుల నుంచి రక్త నమూనాలను సేకరించాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ వెంకటలక్ష్మి, హెచ్‌వీలు రాణి, దుర్గమ్మ, సిబ్బంది శ్రీను, కృష్ణయ్య, విజయ్‌రెడ్డి పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం

భద్రాచలంఅర్బన్: శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో విధులు నిర్వర్తిస్తూ గుండెపోటుతో హోంగార్డు మోహన్ మంగళవారం మృతిచెందిన విషయం విదితమే. బుధవారం ఏఎస్పీ పరితోష్ పంకజ్, టౌన్ సీఐ నాగరాజురెడ్డి, ఎస్‌ఐలు మధుప్రసాద్, శ్రీకాంత్, ట్రాఫిక్ ఎస్‌ఐ పీవీఎన్ రావు మోహన్ కుమార్ కుటుంబాన్ని పరామర్శించి, అన్నివిధాలా అండగా ఉంటామని తెలిపారు. ఈ సందర్భంగా ఏఎస్పీ పరితోష్ పంకజ్ మృతుడి కుటుంబానికి రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో భద్రాచలం ఏఎస్పీ కార్యాలయ సిబ్బంది, టౌన్, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



మోహన్ భార్యకు నగదు అందజేస్తున్న ఏఎస్పీ

వరద సమస్యకు చెక్

సాక్షి ఎఫెక్ట్..

అశ్వారావుపేటరూరల్: చిన్నపాటి వర్షానికే ప్రభుత్వ పాఠశాల ఆవరణలో వరదనీరు పోటెత్తుతున్న సమస్యను ఎట్టకేలకు పరిష్కరించారు. మండలంలోని వినాయకపురం కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణ, వంట గది, గేటు వద్ద వర్షం కురిస్తే చాలు వరదనీరు వచ్చి చేరుతోంది. ఈ సమస్యపై గత నెల 24వ తేదీన సాక్షి దినపత్రికలో 'బడిలోకి పోటెత్తిన వర్షపునీరు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు బడి ఆవరణలోని పల్లపు ప్రాంతం అంతా మట్టి పోయించడంతో వరద నీటి సమస్య తొలగింది.

కమిటీని నియమించాలి

గుండాల: ఉద్యోగుల వేతన సవరణ కోసం వెంటనే పీఆర్సీ కమిటీని నియమించాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు జోగా రాంబాబు డిమాండ్ చేశారు. ఆళ్లపల్లి మండలం అనంతోగు ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యాన బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఆర్సీ కమిటీని నియమించడమే కాక అమల్లోకి వచ్చే వరకు ఐఆర్ ప్రకటించాలని కోరారు. చాట్ల శ్రీనివాస్, భూక్యా వీరన్న, రామయ్య, రామకృష్ణ, మోహన్‌బాబు, సత్యనారాయణ, హీరాలాల్, వెంకటేశ్వర్లు, రాంబాబు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

దమ్మపేట: మండలంలోని శ్రీరాంపురం గ్రామానికి చెందిన నున్నా రత్నారావు తల్లి పిచ్చమ్మ అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందారు. బుధవారం ఆమె మృతదేహం వద్ద ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు నివాళులర్పించి కుటుంబీకులను ఓదార్చారు. జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, అబ్దుల్ జిన్నా తదితరులు పాల్గొన్నారు. అలాగే, లింగాలపల్లికి చెందిన ప్రజాపంథా నాయకుడు సరియం వసంతరావు మంగళవారం మృతి చెందగా నాయకులు అమర్లపూడి రాము తదితరులు నివాళులర్పించారు. నాయకులు అమర్లపూడి శరత్, ఊకే అప్పారావు, దుర్గమ్మ, బండి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

అశ్వాపురం: మండలంలోని అమెర్ద గ్రామ పంచాయతీకి చెందిన బీజేపీ మండల కార్యదర్శి కల్లూరి రామారావు, కాంగ్రెస్ నాయకుడు ఇరుగు కృష్ణతేజ గురువారం మొండికుంట గ్రామంలో ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్, జెడ్పీటీసీ సులక్షణ, నాయకులు నేలపట్ల సత్యనారాయణరెడ్డి, ఇరుగు నర్సయ్య, నాగరాజు, కందుల కృష్ణార్జున్‌రావు, సూదిరెడ్డి గోపాలకృష్ణారెడ్డి, ఎన్నా అశోక్‌కుమార్ నాయకులు పాల్గొన్నారు.

కార్పెంటర్ల కమిటీ ఎన్నిక

భద్రాచలంటౌన్: డివిజన్ కార్పెంటర్ల యూనియన్ కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని విశ్వబ్రాహ్మణ సంఘం కార్యాలయంలో జరిగిన ఎన్నికల్లో డివిజన్ అధ్యక్షుడిగా అనుగోజు నర్సింహాచారి, కార్యదర్శిగా అప్పారి రాము, కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ.. కార్పెంటర్ల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. మధు, సత్తిబాబు, శ్రీను, చాట్ల శ్రీను, షరీఫ్, ఆదినారాయణ, హరిబాబు, అనిల్ పాల్గొన్నారు.

పోడు హక్కు పత్రాల అందజేత



చర్ల: పులిగుండాలలో పోడుహక్కు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే పొదెం వీరయ్య



అన్నపురెడ్డిపల్లి: పోడు పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

చర్ల: మండలంలోని పలు గ్రామాల్లో పోడుసాగుదారులకు భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య పోడు హక్కు పత్రాలను పంపిణీ చేశారు. మండలంలోని పులిగుండాల, దేవరాపల్లి, కుదునూరు, ఆర్.కొత్తగూడెం, సత్యనారాయణపురం, చర్ల, ఉప్పరిగూడెం, కొయ్యూరు, సుబ్బంపేట గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌ల ఆధ్వర్యాన బుధవారం ఏర్పాటు చేసిన సభల్లో ఆయన హక్కు పత్రాలు అందజేసి మాట్లాడారు. నాటి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన అటవీహక్కుల చట్టం ప్రకారమే హక్కు పత్రాల పంపిణీ కొనసాగుతోందని తెలిపారు. అయితే, సాగులో ఉన్న ప్రతీ గిరిజన రైతుకు హక్కుపత్రాలను జారీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీ జి.కోదండరామయ్య, తహసీల్దార్ బి.భరణిబాబు, ఎంపీడీఓ జి.రాజేంద్రకుమార్, నాయకులు నల్లపు దుర్గాప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పోడు సాగుదారుల కల నెరవేరింది..

అన్నపురెడ్డిపల్లి: సీఎం కేసీఆర్ చొరవతో ఏళ్లుగా పోడు పట్టాల కోసం ఎదురుచూస్తున్న గిరిజనుల కల నెరవేరిందని అశ్వారావుపేట ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని మర్రిగూడెం, తొట్టిపంపు, అన్నపురెడ్డిపల్లి, పెంట్లం గ్రామ పంచాయతీల పరిధిలో నిర్వహించిన సమావేశాల్లో గిరిజన పోడు రైతులకు ఆయన పట్టాలు, కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను అందజేసి మాట్లాడారు. గిరిజన, పోడు రైతులకు సీఎం ఎల్లప్పుడూ అండగా ఉంటారని తెలిపారు. ఎంపీపీ సున్నం లలిత, జెడ్పీటీసీ భారత లాలమ్మ, తహసీల్దార్ భద్రకాళి, ఎంపీడీఓ రేవతితో పాటు బోయినపల్లి సుధాకర్‌రావు, మామిళ్లపల్లి రామారావు, కొత్తూరు వెంకటేశ్వరరావు, నరసింహారావు, నర్సారెడ్డి, వీరబోయిన వెంకటేశ్వర్లు, కాటంరాజు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

విప్, ఎమ్మెల్యే రేగా కాంతారావు



దుమ్ముగూడెం: విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న విప్ కాంతారావు

దుమ్ముగూడెం: క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసంతో పాటు దేహదారుఢ్యానికి దోహదపడుతాయని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు తెలిపారు. మండలంలోని ములకపాడు ప్రభుత్వ వైద్యశాల క్రీడామైదానంలో నిర్వహించిన ఫ్రెండ్స్ క్రికెట్ టోర్నీ బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా విజేతగా నిలిచిన రఘు లెవెన్ జట్టుకు ఆయన బహుమతి అందజేసి మాట్లాడారు. ఎంపీపీ రేసు లక్ష్మి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అన్నె సత్యనారాయణమూర్తితో పాటు జానీపాషా, నక్కా ప్రసాద్, దామెర్ల శ్రీను, కెల్లా అశోక్, తెల్లం హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అన్నివర్గాల అభ్యున్నతే సీఎం ధ్యేయం

మణుగూరురూరల్: అన్నివర్గాల ప్రజల అభ్యున్నతే సీఎం కేసీఆర్ ధ్యేయమని పినపాక ఎమ్మెల్యే, విప్ రేగా కాంతారావు అన్నారు. మండలంలోని సమితి సింగారం గ్రామపంచాయతీ ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి మణికంఠనగర్ వరకు ఎస్‌డీఎఫ్ నిధులు రూ.1.20 కోట్లతో చేపట్టనున్న రహదారి నిర్మాణ పనులకు విప్ బుధవారం శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఆ తర్వాత రాజుపేటలో ఇటీవల మృతి చెందిన సిరికొండ శ్రీనివాస్ కుటుంబాన్ని పరామర్శించారు. జెడ్పీటీసీ పోశం నర్సింహారావు, ఎంపీపీ కారం విజయకుమారి, సర్పంచ్ బచ్చల భారతితో పాటు కుర్రి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కార్యకర్తలను కాపాడుకుంటాం

బూర్గంపాడు: బీఆర్‌ఎస్ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని ప్రభుత్వ విప్ రేగా కాంతారావు తెలిపారు. మండలానికి చెందిన కార్యకర్తలు సున్నం నాగేశ్వరరావు, బర్ల వీరయ్య కొద్దిరోజుల కిందట రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, వారి కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున మంజూరైన బీమా చెక్కులను విప్ అందజేశారు. జెడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత, మార్కెట్ చైర్మన్ పొడియం ముత్యాలమ్మతో పాటు బిక్కసాని శ్రీనివాసరావు, గోపిరెడ్డి రమణారెడ్డి, జలగం జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీస్‌ల అందజేత



వైద్యాధికారికి సమ్మె నోటీస్ అందిస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలు

ములకలపల్లి: ప్రభుత్వ ఆస్పత్రుల్లో విధులు నిర్వర్తిస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలను పర్మనెంట్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నరాటి ప్రసాద్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10, 11 తేదీల్లో హైదరాబాద్‌లోని హెల్త్ డైరెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్నామని తెలిపారు. అనంతరం వైద్యాధికారికి సమ్మె నోటీస్ అందించారు. కార్యక్రమంలో బాణోతు ప్రియాంక, జ్యోతి, వెంకటమ్మ, అనిత, ఈశ్వరమ్మ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు. కాగా, తమ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10, 11, 12 తేదీల్లో చేపట్టనున్న టోకెన్ సమ్మెను విజయవంతం చేయాలని మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి బుగ్గ వెంకటనర్సమ్మ పిలుపునిచ్చారు. స్థానిక ఎమ్మార్వోలో సమ్మె నోటీసు అందజేశారు. పద్దం తిరుపతమ్మ, అన్నవరపు ఇందిర, ముదిగొండ అనసూర్య పాల్గొన్నారు. అలాగే, జీపీ వర్కర్స్ జేఏసీ ఆధ్వర్యంలో ఎస్‌ఐ సాయికిశోర్‌రెడ్డికి సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో అవులూరి రాంబాబు, సాయిరత్న, గంటా శ్రీను, మేకల రమేశ్, వర్కా రుక్మాంగధరరావు, కొక్కెరగడ్డ సతీశ్ ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



మాట్లాడుతున్న సీఐ రమేశ్

మణుగూరురూరల్: మణుగూరులోని సురక్ష బస్టాండ్ ప్రాంతంలో సీఐ ముత్యం రమేశ్ ట్రాఫిక్ నియమాలపై ఆటోడ్రైవర్లకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఆటోడ్రైవర్లు వాహనాలు నడిపేటప్పుడు యూనిఫామ్ ధరించాలని, వాహన ధ్రువపత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులు కలిగి ఉండాలని, మద్యం సేవించి వాహనాలను నడపొద్దని సూచించారు. కాగా, సురక్ష బస్టాండ్ ప్రాంతంలో సీఐ ముత్యం రమేశ్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ పురుషోత్తం వాహనాలు తనిఖీ చేశారు. ద్విచక్ర వాహనాలు, కార్లను నిలిపి క్షుణ్ణంగా తనిఖీ చేయడంతో పాటు సంబంధిత పత్రాలను, డ్రైవింగ్ లైసెన్సులను పరిశీలించారు. సరైన పత్రాలు లేకుండా, నిబంధనలు అతిక్రమించిన వారికి జరిమానా విధించారు.



అటెన్షన్ ప్లీజ్

నిరంతరాయంగా వెలుగులు!

మండలంలోని సమితిసింగారం గ్రామపంచాయతీ పరిధి కొత్త ఆర్‌అండ్‌ఆర్‌కాలనీలో ఇటీవల విద్యుత్ లైట్లు బిగించారు. అయితే, వాటికి ఆన్, ఆఫ్ స్విచ్‌లు లేవో.. ఉన్నా సిబ్బంది పట్టించుకోవడం లేదో తెలియదు కానీ లైట్లు రాత్రీ పగలు తేడా లేకుండా నిరంతరం వెలుగుతూనే ఉన్నాయి. దీంతో పంచాయతీపై బిల్లుల భారం పడే అవకాశముందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉద్యోగులు స్పందించాలని కోరుతున్నారు.

–మణుగూరురూరల్



ప్రశ్నించాల్సిన అధికారి : జి.వేణుగోపాల్, విద్యుత్‌శాఖ ఏఈ,
సెల్ నంబర్ : 94408 11555